ప్రశాంతంగా గ్రూప్-1



పరీక్ష కేంద్రం వేరుకావడంతో.. అసలు కేంద్రానికి పరుగెడుతున్న అభ్యర్థి

గ్రూప్-1 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. తాండూరు పట్టణంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలో మొత్తం 1,488 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా.. 353 మంది గైర్హాజరయినట్లు అధికారులు తెలిపారు. నిమిషం ఆలస్యం నిబంధనలను పక్కాగా అమలు చేశారు. ఉదయం 10గంటల తరువాత వచ్చిన ఎనిమిది మంది అభ్యర్థులను నిరాకరించడంతో.. నిరాశతో వెళ్లిపోయారు.

– తాండూరు టౌన్



నిమిషం ఆలస్యంగా రావడంతో అనుమతించని అధికారులు



డీఎస్పీ బాలకృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాండూరు టౌన్: తాండూరు పరిధి 220/132/33 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని డీఈ భానుప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 9 వరకు తాండూరు టౌన్, పాత తాండూరు, పెద్దేముల్ మండల పరిధి మంబాపూర్, ఇందూర్, గాజీపూర్, తట్టేపల్లి, తుర్ మామిడి, మర్పల్లి, ధారూర్ మండలాల పరిధి పలు ప్రాంతాలు, యాలాల మండలంలోని లక్ష్మీనారాయణపూర్, దౌల్తాపూర్‌లో సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని డీఈ కోరారు.

అధ్వాన రోడ్డుతో అవస్థలు



మద్వాపూర్-కోట్‌పల్లి రోడ్డు దుస్థితి

బంట్వారం: మట్టి రోడ్డుతో వాహనదారులు, బాటసారులు ఇబ్బంది పడుతున్నారు. మండల పరిధి మద్వాపూర్ నుంచి కోట్‌పల్లికి వెళ్లే మార్గం.. సుమారు 4 కిలో మీటర్లు ఉంటుంది. లింకు రోడ్డు కావడంతో పరిసర ప్రాంత ప్రజలు ఎక్కువగా ఈ రోడ్డు ద్వారానా రాకపోకలు సాగిస్తుంటారు. ద్విచక్రవాహనాలు మినహా ఆటోలు కూడా ఈ మట్టిరోడ్డులో ముందుకు సాగని దుస్థితి. ప్రతి సోమవారం కోట్‌పల్లిలో సంత కొనసాగుతుండటంతో మద్వాపూర్ గ్రామస్తులు ఎక్కువగా ఈ మార్గం గుండా కాలినడకన వెళ్తుంటారు. వర్షాకాలం అయితే కాలినడకనా కష్టమేనని, కనీసం మెటల్ రోడ్డు వేస్తే బాటుంటుందంటున్నారు. సమస్యను సంబంధిత పంచాయతీరాజ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా స్పందించి మెటల్ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇంటింటికీ బీజేపీ శ్రేణులు



టిఫిన్ బ్యాకులు పంపిణీ చేస్తున్న పార్టీ శ్రేణులు

కుల్కచర్ల: బీజేపీ నాయకులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పార్టీని మరోసారి గెలిపించినందుకు కృతజ్ఞతగా.. బైటక్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కృతజ్ఞతలు తెలుపుతూ.. టిఫిన్ బాక్సులు అందజేశారు. ఆదివారం మండల పరిధి బొంరెడ్డిపల్లిగ్రామంలో పార్టీ శ్రేణులు టిఫిన్ బాక్సులు పంపిణీ చేశారు. అనంతరం పార్టీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సౌమ్యారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సురేష్ మాట్లాడారు. దేశం కోసం.. ధర్మం కోసం పార్టీ చేస్తున్న కృషికి మద్దతు తెలపాలని కోరారు. మోదీని మరోసారి ఆశీర్వదించిన సందర్భంగా ఊరూరుకు తిరుగుతూ కృతజ్ఞతలు తెలుపుతామని వెల్లడించారు. పార్టీ నాయకులు ఘణపురం వెంకటయ్య, మైపాల్, హరి, చంద్రలింగం, హన్మంతు, సంగెం శ్రీను, మైపాల్, వెంకటయ్య, రాజు, నర్సింహ పాల్గొన్నారు.

వర్షాకాలంలో జాగ్రత్త

యాలాల: మండలంలో రెండు రోజులుగా ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ మునీరొద్దీన్ సూచించారు. ముఖ్యంగా వ్యవసాయ పనుల్లో ఉన్న రైతులు వర్షం పడుతున్న సమయంలో చెట్ల కిందకు వెళ్లరాదని, ఉరుములు మెరుపులు వస్తున్నప్పుడు సెల్‌ఫోన్లు వినియోగించరాదని కోరారు. విద్యుత్ స్తంభాలను ముట్టుకోకూడదని, పూరాతన ఇళ్లలో ఉండరాదని పేర్కొన్నారు.

అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన మాజీ ఎమ్మెల్యే

తాండూరు: మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అనారోగ్యంతో ఆసుపత్రి పాలయ్యారు. పార్లమెంటు ఎన్నికల తరువాత ఆయన మే 17న సౌతాఫ్రికా వెళ్లారు. పక్షం రోజుల అనంతరం ఈ నెల 1న హైదరాబాద్‌కు వచ్చారు. మరుసటి రోజు రోహిత్‌రెడ్డి.. భార్యాపిల్లలతో కలిసి దుబాయ్‌కి వెళ్లారు. ఈ నెల 7న రాత్రి దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు తిరిగి వస్తున్న క్రమంలో తీవ్ర జ్వరంతో బాధపడ్డారు. అర్ధరాత్రి ఇంటికి చేరుకొని నిద్రకు ఉపక్రమించే సమయంలో జ్వరం తీవ్రత పెరిగి పైలట్ అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే జూబ్లీహిల్స్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన చికిత్స పొందుతున్నారు.

పేద విద్యార్థికి చేయూత

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కొండన్నగూడ గ్రామానికి చెందిన నాగిసాయిలు కుమారుడు సుభాష్‌చంద్ర సిద్దిపేటలోని ఆర్‌వీఎం కళాశాలలో ఎంబీబీఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. అతనిది నిరుపేద కుటుంబం కావడంతో ప్రముఖ వ్యాపారవేత్త నాగిళ్ల గోపాల్‌గుప్తా రూ.35వేల నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు.

ఐదు తరగతులు.. ఒకే టీచర్!

- తీరని తరగతి గదుల సమస్య
- వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- నష్టపోతున్న విద్యార్థులు
- పట్టించుకోని ప్రభుత్వం, పాలకులు



ఓంలానాయక్‌తండాలో ఒకే గదిలో ఐదు తరగతుల విద్యార్థులకు పాఠాలు చెబుతున్న టీచర్(ఫైల్)

పెద్దేముల్: సర్కారు బడుల్లో నెలకొన్న తరగతి గదుల సమస్య విద్యాధికారులకు ఇబ్బందిగా మారింది. ఉపాధ్యాయులు ఉన్న చోట తరగతి గదుల కొరత, తరగతి గదులు ఉన్న చోట ఉపాధ్యాయుల లేమితో పరోక్షంగా అధికారులు ఇక్కట్లు పడుతుండగా.. ప్రత్యక్షంగా విద్యార్థులు నష్టపోతున్నారు. మండల పరిధి ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు మొత్తం 61 ఉండగా.. వాటిల్లో విద్యార్థుల సంఖ్య సుమారు 5,038 పైగా ఉంది. 45 ప్రాథమిక పాఠశాలకు తట్టెపల్లి, కందనెల్లితండా, అడ్కిచెర్ల, మారేపల్లి, మంబాపూర్, గాజీపూర్, నాగులపల్లి బడులకు మినహా మిగతా వాటికి పూర్తి స్థాయిల్లో తరగతి గదులు లేక ఒకటి, రెండు గదుల్లో బోధన జరుగుతోంది.

గిరిజన బిడ్డలకు అందని విద్య

మనఊరు–మనబడి కార్యాక్రమంలో భాగంగా కొత్త భవనాలు మంజూరు చేయాలని గత ప్రభుత్వాన్ని కోరామని, అయినప్పటికీ ఎలాంటి ఫలితం లేదని నాటి సర్పంచ్‌లు గోవర్ధన్ నాయక్, గెమ్యానాయక్, టోప్యానాయక్ ఆరోపిస్తున్నారు. రచ్చకట్టతండా పాఠశాలల్లో కేవలం ఒకే గది ఉందని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తరగతి గదులు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని విద్యాధికారులు, ప్రజలు కోరుతున్నారు. మండల పరిధి కర్ణాటక రాష్ట్రం సరిహద్దులోని తండాల విద్యార్థులకు సర్కారు విద్య సరిగా అందడం లేదని వారి తల్లిదండ్రులు తెలిపారు. కొత్తగా విద్యాసంవత్సరం ప్రారంభం కానుందని, ఇప్పుడైనా తరగతి గదులు, ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని కోరుతున్నారు. ఇదే విషయమై.. మండల విద్యాధికారి వెంకటయ్యను వివరణ కోరగా.. మండలంలో ఉపాధ్యాయుల కొరత, తరగతి గదులు సమస్య ఉన్న విషయం వాస్తవమేనని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. కొత్త భవనాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు.

కమ్యూనిటీ హాల్‌లో..



కమ్యూనిటీ భవనంలో విద్యాబోధన

పాషాపూర్ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం రాంసింగ్‌తండా పాఠశాలకు ఏడేళ్లుగా పర్మినెంట్ టీచర్ లేరని, శాశ్వత ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఓంలానాయక్‌తండాలో 1నుంచి 5వ తరగతి వరకు ఉన్నా.. అన్ని తరగతుల విద్యార్థులకు ఒకే టీచర్ పాఠాలు బోధిస్తున్నారు. ఉన్న టీచర్ సెలవుపై వెళితే.. విద్యార్థులు నష్టపోతున్నారని గిరిజన బిడ్డల తల్లిదండ్రులు తెలిపారు. ఒంటి మామిడి తండా పాఠశాలకు గదులు ఉన్నా, కేవలం ఒకే ఉపాధ్యాయురాలితో కొనసాగుతోంది. మదనంతపూర్‌లో పాఠశాల భవనం కూల డానికి సిద్ధంగా ఉందని, అయినా ప్రభుత్వం కొత్త భవనం మంజూరు చేయకపోవడంతో.. కమ్యూనిటీ హాల్‌లోని ఒక గదిలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఉపాధ్యాయులు విద్యాబోధన చేయడం గమనార్హం.

కంచె వేయండి.. కరెంటు సార్లు

మూడేళ్లుగా విన్నవిస్తున్నా..
పట్టించుకోని విద్యుత్ అధికారులు



కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

పెద్దేముల్: పాఠశాలకు వెళ్లే మార్గంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని ట్రాన్స్ అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండల పరిధి అడ్కిచెర్ల గ్రామ సమీపంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లే రోడ్డు పక్కన రక్షణగా కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. నిత్యం విద్యార్థులు తిరుగుతుంటారని, మూగజీవాలు మేత మేస్తూ సంచరిస్తుంటాయని.. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయాలని అడ్కిచెర్ల, ఉరేంటితండా, బాయిమీదితండా తదితర గ్రామాల ప్రజలు మూడేళ్లుగా అధికారులను కోరుతూనే ఉన్నారు. ఇదే విషయాన్ని మండల సర్వసభ్య సమావేశంలో పలుమార్లు నాటి సర్పంచ్‌లు సభ దృష్టికి తెచ్చారు. అయినా.. విద్యుత్ అధికారుల్లో చలనం రావటం లేదని పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరగకముందే నియంత్రిక చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సర్కారు బడి.. భవిష్యత్తుకు పునాది



హస్నాబాద్‌లో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

దుద్యాల్: పట్టు విడవకుండా ఉపాధ్యాయులు బడిబయటి పిల్లలను గుర్తించేందుకు గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ.. ఇంటింటికీ తిరుగుతూ.. విద్యార్థుల వివరాలను సేకరిస్తున్నారు. బడిబయట పిల్లల గురించి ఆరా తీస్తున్నారు. మండల పరిధి హస్నాబాద్ గ్రామం ఎంపీపీఎస్, జీయూపీఎస్ పాఠశాలల ఉపాధ్యాయులు బస్వలింగమ్మ, అన్నపూర్ణ, అశ్విని, అలివేలు , కల్పనలు ఇంటింటికి తిరుగుతూ సర్వే చేశారు. బడీడు పిల్లలను బడికి పంపించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభించడంతో పాటు.. ప్రభుత్వం అన్ని సౌకర్యాలను కల్పిస్తుందని వివరిస్తున్నారు. మీమీ పిల్లలను సర్కారు బడిలో చేర్పించి, వారి భవిష్యత్తుకు పూనాది వేయాలని సూచించారు.

వార్షికోత్సవానికి ఆలయం ముస్తాబు

- రేపు పార్వతీపరమేశ్వరుల కల్యాణం
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



ముస్తాబైన ఆలయం

మొయినాబాద్‌రూరల్: ప్రతి సంవత్సరం సోమేశ్వర ఆలయ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఆలయ చైర్మన్ జంగం యాదవ్, ఆలయ కమిటీ పెద్దలు, మాజీ సర్పంచ్ ముదిగొండ రాజయ్యయాదవ్‌లు కృషి చేస్తున్నారు. అదే విధంగా ఈ సంవత్సరం 14వ వార్షికోత్సవాన్ని నిర్వహించేందుకు ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయానికి రంగులు వేసి విద్యుద్దీపాలతో అలంకరించాలమని పేర్కొన్నారు. 11వ తేదీ మంగళవారం పార్వతీపరమేశ్వరుల కల్యాణంతో పాటు అభిషేకాలు, గణపతి హోమం పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 7 గంటలకు అభిషేకాలు, గణపతి హోమం ఉంటుందన్నారు. 11 గంటలకు పార్వతీపరమేశ్వరుల కల్యాణం జరుగుతుందని, స్వామివారి కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు. ఈ వార్షికోత్సవానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. గ్రామంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు అందరూ పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఉద్యమకారుల ఫోరం
జిల్లా వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ ఇబ్రహీం



నిరసన తెలుపుతున్న సయ్యద్ ఇబ్రహీం తదితరులు

షాబాద్: తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని ఉద్యమకారుల ఫోరం జిల్లా వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ ఇబ్రహీం పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఉద్యమకారులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి మేనిఫెస్టోలో పెట్టినట్లు ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు గుర్తించేందుకు ఒక కమిటీ ఏర్పాటు చేయాలని, అమరవీరుల కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు తమ ప్రాణాలను సైతం లేక్క చేయకుండా ఉద్యమాలు చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఉద్యమకారులు శివకుమార్, బాల్‌రాజ్, గౌసియాబేగం, రావుల లక్ష్మి ఉన్నారు.

భవిష్యత్‌లోనూ విజయం మాదే..



సమావేశంలో పాల్గొన్న కమలనాథులు

ధారూరు: గత పదేళ్ల బీజేపీ పాలన దేశ రక్షణ, హిందూ ధర్మం కోసం కొనసాగిందని ఆ పార్టీ జిల్లా, మండల నాయకులు తెలిపారు. ఆదివారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రధాని మోదీ పాలనను మెచ్చిన ప్రజలు.. చేవెళ్లలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించారని తెలిపారు. కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న మండలంలో ఏకంగా 628 ఓట్ల మెజారిటీ సాధించిన ఘనత బీజేపీదేనని పేర్కొన్నారు. పార్టీలోకి వలసలు ఊపందుకున్నాయని, రానున్న సర్పంచు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ చైర్మన్ల ఎన్నికల్లోనూ కాషాయ జెండా ఎగరడం ఖాయమని ఆశాభావం వ్యక్తంచేశారు. సమావేశంలో బీజేపీ జిల్లా, మండల నాయకులు వడ్లనందు, పాండుగౌడ్, రాజునాయక్, వివేకానందరెడ్డి, రమేశ్, రాజేందర్‌గౌడ్, విశ్వనాథం, వెంకటయ్య, సాయిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి నేడు

అనంతగిరి: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత కలెక్టరేట్ ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణిని నేటి నుంచి యథావిధిగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండటం వలన కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు కలెక్టర్ నారాయణరెడ్డి వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియ ముగిసినందున తిరిగి ప్రజావాణిని నియమించనున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

యాలాల ఇన్‌చార్జి ఎస్‌ఐగా విఠల్‌రెడ్డి



యాలాల: ఇన్‌చార్జి ఎస్‌ఐగా కరణ్‌కోట ఎస్‌ఐ విఠల్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. యాలలలో పని చేస్తున్న శంకర్.. అనారోగ్య కారణాలతో దీర్ఘకాలిక సెలవులపై వెళ్లారు. ఆయన స్థానంలో విఠల్‌రెడ్డిని ఇన్‌చార్జిగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. గతంలో ఇక్కడ ఎస్‌ఐగా విధులు నిర్వహించిన విఠల్‌రెడ్డికి.. మండలంపై పూర్తి అవగాహన ఉంది.



బంట్వారం: నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

అ‘పూర్వ’ సమ్మేళనం

దుద్యాల్: రెండు దశాబ్దాల క్రితం కలిసి చదువుకున్న బాల్యమిత్రులందరూ ఏకమయ్యారు. పాఠశాల వేదికగా నిర్వహించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో సందడిచేశారు. ఆడుతు పాడుతూ.. ఉషారుగా గడిపారు. మండల పరిధి హస్నాబాద్ గ్రామం జిలా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000–2001వ విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు.. 24 సంవత్సరాల తరువాత కలుసుకున్నారు. ఆత్మీయంగా పలకరించుకుంటూ.. నాటి జ్ఞాపకాలను గుర్తుకు చేసుకున్నారు. విద్యాబుద్ధులు చెప్పిన గురువులతో ముచ్చటించారు. యోగ క్షేమ సమాచారాలు కొనుగొన్నారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయుడు తిరుమలేశ్, నాటి విద్యార్థులు శ్రీనివాస్, ఉస్మాన్, రమేశ్, మహేశ్, వెంకటేశ్, ఆశయ్య, షఫిక్, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

కోట్‌పల్లిలో..

బంట్వారం: కోట్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో 1998–1999వ విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా రెండు దశాబ్దాల అనంతరం కలుసుకున్న బాల్యమిత్రులందూ ఆత్మీయంగా పలకరించుకున్నారు. కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులతో ముచ్చటించారు. నాటి జ్ఞాపకాలను గుర్తుకు చేసుకుంటూ సందడి చేశారు. ఆడుతుపాడుతూ కేరింతలు కొట్టారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో నాటి హెడ్‌మాస్టర్ బస్వరాజ్, ఉపాధ్యాయులు శకుంతల, రఘునాథ్, నర్సింహరెడ్డి, సంగప్ప పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌ఏపీ కళాశాలలో..

అనంతగిరి: వికారాబాద్ పట్టణం ఎస్‌ఏపీ కళాశాలలో 1999–2002 విద్యాసంవత్సరంలో ఇంటర్ పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు.. ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకొన్నారు. రెండు దశాబ్దాల అనంతరం కలుసుకున్న నాటి మిత్రులందరూ ఒకే వేదికగా సందడి చేశారు. ఆప్యాయంగా పలకరించుకుంటూ.. నాటి జ్ఞాపకాలను గుర్తుకు చేసుకున్నారు. నాడు పాఠాలు చెప్పిన గురువులను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. ఇందులో కళాశాల పూర్వ అధ్యాపకులు డాక్టర్ వీరయ్య, డా.అంజయ్య, డా.ముత్తారెడ్డి, డా.మల్లారెడ్డి, ధనశెట్టి తదితరులు పాల్గొన్నారు.



దుద్యాల్‌లో..



అనంతగిరి: అధ్యాపకులతో విద్యార్థులు

జీపీ భవనం పూర్తయ్యేదెన్నడో..

ఏళ్లు గడుస్తున్నా.. పూర్తి కాని నిర్మాణం



అర్ధాంతరంగా నిలిచిన బీరోల్ జీపీ భవన నిర్మాణ పనులు

బంట్వారం: గ్రామ పంచాయతీ సొంత భవనం కలగానే మిగిలింది. రూ.లక్షలు వెచ్చించి నిర్మాణ పనులు మొదలు పెట్టి, మొదట్లోనే నిలిపివేయడంతో ప్రజాధనం వృథాగా మారింది. కారణం ఏదైనప్పటికీ.. పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా.. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే నన్న చందంగా భవన నిర్మాణ పనులు నేటికీ స్లాబ్ దశలో దర్శనమిస్తోంది. వివరాలు ఇలా ఉన్నాయి. కోట్‌పల్లి మండలం బీరోల్ గ్రామంచాయతీ భవన నిర్మాణానికి ఎన్‌ఆర్ ఈజీఎస్ నిధులు రూ.12లక్షలు 2017 సంవత్సరంలో మంజూరయ్యాయి. అనంతరం పనులు చేపట్టిన కాంట్రాక్టర్.. స్లాబ్ వేసి నిలిపి వేశారు. ఇదేమిటని ఆరా తీయగా.. బడ్జెట్ ఉన్నంత మేరకే పనులు చేపట్టినట్లు సమాచారం. ఇక నాటి నుంచి నిర్మాణ పనుల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తెలిపారు. భవనం పూర్తికాక.. స్థానిక ప్రజాప్రతినిధులు.. చిన్నపాటి పురాతన భవనంలో జీపీ పరిపాలనను కొనసాగిస్తున్నారని వెల్లడించారు.

పురాతన భవనంలో..

పురాతన భవనాన్ని చాలా కాలంగా వెటర్నరీ సబ్ సెంటర్‌గా ఉపయోగించే వారు. జీపీ కార్యకాలాపాలు ఇక్కడే కొనసాగేవి. రెండు ఒకే చోట కొనసాగుతుండటంతో ఇబ్బందిగా ఉండేది. ఈ క్రమంలో వెటర్నరీ ఆస్పత్రికి కోసం కొత్తగా భవనం నిర్మించగా.. వెటర్నరీ సబ్ సెంటర్‌ను అక్కడికి తరలించారు. ఇక నాటి పురాతన భవనాన్ని జీపీ కార్యాలయంగా పూర్తి స్థాయిలో వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా 2017లో కొత్తగా జీపీ భవన నిర్మాణానికి ప్రభుత్వ శ్రీకారం చుట్టగా.. 2018లో పనులు మొదలై.. నిధుల లేమితో స్లాబ్‌వరకే పరిమితం అయింది.

ఆ నిధులతోనే పూర్తి చేయాలి

ఇప్పటి వరకు భవన నిర్మాణ పనుల గురించి ఎవరూ తమ దృష్టికి తీసుకు రాలేదు. గ్రామాన్ని సందర్శించి నిర్మాణ పనులను పరిశీలిస్తా. అప్పట్లో మంజూరైన నిధులతోనే భవనాన్ని పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇంత కాలం స్లాబ్ దశలోనే పనులు ఎందుకు నిలిపారో తెలుసుకుంటా. భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటాను. – జితేందర్, డీఈ పీఆర్